



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 10 జులై 2025 పేజీలు 8




ప్లాన్‌లేకుండా నిర్మాణాలు చేపడితే..

# కూల్చేస్తాం

- సిటీ ప్లానర్ సంజయ్ కుమార్
- అనధికార అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** 'నగరంలో అనధికార కట్టడాలపై పేదోడి భవనాలు కూలుస్తున్నారు పెద్దోడి భవనాలు దగ్గరుండి మరీ కట్టిస్తున్నారు టౌన్ ప్లానింగ్‌లో ఇదేం న్యాయమంటూ' నేటి దినపత్రిక సూర్యలో ప్రచురించిన శీర్షికతో సిటీప్లానర్ సంజయ్ కుమార్ స్పందించారు. నగరంలో అక్రమంగా నిర్మిస్తున్న అనధికార కట్టడాలపై కొరడా ఝులిపిస్తున్నారు. సాధారణంగా నగరంలో అనేక ప్రాంతాలలో యధేచ్ఛగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. వెరసి టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దీంతో నేటి దినపత్రిక సూర్యలో ప్రచురించిన శీర్షికకు సిటీ ప్లానర్ సంజయ్ కుమార్ స్పందించి నగరంలోని ప్రధాన కూడలిలో నిర్మిస్తున్న అనధికార నిర్మాణాన్ని కూల్చివేశారు. నగరంలో ప్లాన్ తీసుకోకుండా అనధికార నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరికైనా సందేహాలుంటే తనను కలవొచ్చని చెబుతున్నారు. సిటీ ప్లానరే నేరుగా రంగంలోకి దిగడంతో అధికారుల్లోనూ అలజడి మొదలైంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న టెన్షన్ అటు అధికారుల్లోనూ ఇటు అనధికార నిర్మాణాలు చేపడుతున్న వారిలోనూ కనిపిస్తుంది. ఏదిఏమైనప్పటికీ అనధికార నిర్మాణాలపై సిటీ ప్లానర్ స్పందించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు బెజవాడ వాసులు..

సూర్య ఎఫెక్ట్

## ప్రమాదాలకు నిలయంగా శ్రీను హోటల్



**ఆర్ అండ్ బి రోడ్డును ఆక్రమించటంతో రద్దీగా శ్రీను హోటల్**

**బస్సులు ఆటోలు ఆగడంతో ట్రాఫిక్ అంతరాయం**

**ట్రాఫిక్‌ని నివారించడంలో పోలీసులు తాత్సారం**

**తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ చోద్యం చూస్తున్న అధికారులు**

**ఆహార భద్రత ప్రమాణాలను గాలికి వదిలేసిన హోటల్ యాజమాన్యం**

**వత్సవాయి జులై 8 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన వత్సవాయి గ్రామం లో పేరుగాంచిన హోటల్లో శ్రీను హోటల్ (శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి హోటల్) ఒకటి. ఇది జగ్గయ్యపేట నుండి వైరా వెళ్లే జాతీయ రహదారి కి ఆనుకుని ఉండడం వలన రద్దీ ఎక్కువగా ఉండి ప్రమాదాలు తరచూ జరుగుతూ ఉంటాయని గ్రామస్తులు అనుకుంటున్నారు. ఈ హోటల్‌కు పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో వాహనదారులు రోడ్డుపైనే తమ వాహనాలను నిలిపి వేయడం వలన ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. అలాగే బస్సులు ఆటోలు కూడా ఈ ప్రాంతంలోనే ఆగడం వలన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఈ ప్రాంతంలో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు చూచి చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈ హోటల్ యాజమాన్యంపై అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు హోటల్ యాజమాన్యం వారు ఇచ్చిన మామూళ్లకు అలవాటు పడి ఫిర్యాదులను చెత్త బుట్టలకే పరిమితం మిగతా 2లో...



## వెల్‌డన్ లక్ష్మీశ..

**రెడ్‌క్రాస్ సేవలకు కలెక్టర్ లక్ష్మీశకు గవర్నర్ ప్రశంసలు**

**నిధుల సమీకరణ, సభ్యత్వ నమోదు, సామాజిక సేవలో కృషికి గుర్తింపు**

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 09, మేజర్ న్యూస్ :** ఎక్కడ విధులు నిర్వర్తించినా, ఏ హోదాలో ఉన్నా జనం నాడి పట్టి వారి బాగోగుల కోసం పరితపించే వ్యక్తిగా ఐఏఎస్ అధికారి డా. జి.లక్ష్మీశకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్‌గా, జిల్లా రెడ్‌క్రాస్ శాఖ అధ్యక్షులుగా సేవలందిస్తున్న ఆయనకు తాజాగా మరో పురస్కారం లభించింది. రెడ్‌క్రాస్‌కు నిధుల సమీకరణ, సభ్యత్వ నమోదులో విశేష ప్రతిభ కనబరచడమే 2

## భోజన పథకాన్ని పరిశీలించిన కలెక్టర్



**గన్నవరం (బాపులపాడు), జులై 09, మేజర్ న్యూస్ :** బుధవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బాపులపాడు మండలంలోని రేమల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులు తింటున్న ఆహారాన్ని రుచి చూసి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఏం చదువుకుంటున్నావు, స్కూల్లో చదువు బాగా చెబుతున్నారా, భవిష్యత్తులో ఏమవుతావు, ప్రతిరోజు భోజనం బాగుంటుందా అని ఆరా మిగతా 2లో...



పవిత్ర సంగమం వద్ద

## జలహారతి

**కృష్ణ, గోదావరి నదులను అనుసంధానం చేసిన విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు : ఎంపీ కేశినేని శివనాథ్**

**గోదావరి జలాలకు హారతి ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్**

వివరాలు 2లో

(మొదటిపేజీ తరువాయి)



## వెల్‌డన్ లక్ష్మీశ..

కాకుండా.. సామాజిక సేవలో చేసిన కృషికి గుర్తింపుగా గౌరవ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ బుధవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన వార్షిక సమావేశంలో అవార్డు అందుకున్నారు. వెల్ డన్.. కీప్ ఇట్ అప్ అంటూ లక్ష్మీశను గవర్నర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పార్వతీపురం ఐటీడీఏ పీవోగా వినూత్నంగా ప్రెగ్నెంట్ ఉమెన్ హాస్టల్ ఏర్పాటుకు శ్రీకారంచుట్టింది మొదలు ఆపై ఎక్కడ పనిచేసినా విధి నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు సాధించారు లక్ష్మీశ. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ ఎన్‌టీఆర్ జిల్లాలోనూ రెడ్‌క్రాస్ ద్వారా పెద్దఎత్తున కార్యక్రమాలకు సారథ్యం వహిస్తున్నారు. నవ్య రాజధానికి గేట్‌వే అయిన విజయవాడలో ఎప్పటికప్పుడు భారీ కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ కార్యక్రమాల్లోనూ రెడ్‌క్రాస్ భాగమై వాటి విజయవంతంలో కీలకపాత్ర పోషిస్తోంది. రక్తదాన శిబిరాల ఏర్పాటు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై యువతను జాగృతం చేయడం.. ఇలా వివిధ కార్యక్రమాల్లో జిల్లా రెడ్‌క్రాస్ యూనిట్ ముందుంటోంది. పేదరికం లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడాలేని విధంగా ఆవిష్కరించిన వినూత్న పీ4 విధానం అమల్లోనూ రెడ్‌క్రాస్ ఓ గొప్ప అడుగుతో అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఏకంగా ఒక సచివాలయం పరిధిలోని మొత్తం 278 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా వ్యవహరించేందుకు తాజాగా ముందుకొచ్చింది.

**ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగింది**

గౌరవ గవర్నర్ నుంచి అవార్డు స్వీకరించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని.. ఈ విజయం స్ఫూర్తితో రెడ్‌క్రాస్ ద్వారా సామాజిక సేవలో జిల్లాకు మరింత గుర్తింపు తెచ్చేందుకు కృషిచేస్తానని.. అదేవిధంగా స్వర్ణాంధ్ర @ 2047 లక్ష్యాల సాధనకు టీమ్ ఎన్‌టీఆర్‌తో కలిసి ముందుకు వెళ్తానని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ఏకే ఫరీదా, ఛైర్మన్ వైడీ రామారావు, వైస్ ఛైర్మన్ పి.జగన్ మోహన్‌రావు, ట్రెజరర్ పి.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా శ్రీను హోటల్



చేసినట్లు తెలుస్తుంది. ఈ హోటల్ నిర్వహణకు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేనట్లు సమాచారం. అలాగే ఆర్ అండ్ బి స్థలాన్ని ఆక్రమించినప్పటికీ ఆ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటో ఉన్నతాధికారులకే ఎరుక. అలాగే ఎక్కువ గిరాకీ ఉన్న ఈ హోటల్ కి ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం వలన ఈ హోటల్లో కల్తీ, నిల్వ (కలుషిత )ఆహార పదార్థాలు వినియోగదారులకు ఉపయోగిస్తున్నట్లు కూడా తెలుస్తుంది. కల్తీ, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను వినియోగదారులకు ఉపయోగించి ప్రభుత్వానికి ఎటువంటి పన్నులు చెల్లించకుండా అక్రమార్జనే ధ్యేయంగా అవినీతికి పాల్పడుతూ అమాయక ప్రజలను, ప్రభుత్వ అధికారులను మోసం చేస్తూ జేబులు నింపుకుంటున్న ఈ హోటల్ యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**(మొదటిపేజీ తరువాయి)**

తీస్తూ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ముందుగా జిల్లా కలెక్టర్, మాక్సిమస్ ఏఆర్సీ లిమిటెడ్ వారి సౌజన్యంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన ఆర్వో ప్లాంట్, కంప్యూటర్ ల్యాబ్, భోజనశాలను ప్రారంభించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు సహృదయంతో ముందుకు వచ్చిన మాక్సిమస్ ఏఆర్సీ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి దేవినేని నన్వా రామ్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన ప్రధానోపాధ్యాయుల చాంబర్లో ఉపాధ్యాయులతో సమావేశమై నేడు గురువారం పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన సందేశాలు పంపడం, ప్రోగ్రెస్ కార్డుల గురించి వాకబు చేస్తూ కార్యక్రమం రోజున ప్రతి విద్యార్థి కొత్త స్కూల్ యూనిఫాం ధరించాలని, సర్వేపల్లి రాధాకృష్ణన్ స్కూల్ కిట్లు ఉండాలని ఆయన ఆదేశించారు. ఉదయం 9 గంటలకు నుంచి కార్యక్రమాలు ప్రారంభం కావాలని, కార్యక్రమంలో విద్యార్థుల ప్రగతిని తెలిపి, తల్లిదండ్రులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు.

**కోకో పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్..**

మండలంలోని రేమల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో బెజవాడ ఏడుకొండలు అనే రైతు 14 ఎకరాల్లో సాగు చేస్తున్న కోకో పంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పంట సాగుకు అయ్యే ఖర్చు, వచ్చే దిగుబడి, సమస్యలు తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. మొక్క నాటిన రోజు నుంచి మూడు సంవత్సరాల తర్వాత పంట చేతికొస్తుందని, సాధారణ చాక్లెట్లతో పాటు యాంటీ డయాబెటిక్ చాక్లెట్ల తయారీ కంపెనీలకు అమ్ముతున్నట్లు రైతు కలెక్టర్ కు వివరించాడు. గుడివాడ డివిజన్ ఆర్డీఓ జి బాలసుబ్రమణ్యం, తహసిల్దార్ మురళి కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లూథర్ పాల్, ఉద్యాన శాఖ అధికారిని జే జ్యోతి, ఏపీ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి తదితరులు కలెక్టర్ తో పాటు ఉన్నారు.

# పవిత్ర సంగమం వద్ద జలహారతి

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 09, మేజర్ న్యూస్ :** దేశంలోనే తొలిసారిగా నదుల అనుసంధానం చేసి చూపించిన అపర భగీరథుడు. పట్టిసీమ ద్వారా కృష్ణా-గోదావరి నదులను అనుసంధానం చేసిన విజనరీ లీడర్ సీఎం చంద్రబాబునాయుడు అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం దగ్గరకు వచ్చిన గోదావరి జలాలకు బుధవారం జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కలెక్టర్ లక్ష్మీశా శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి జలహారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ జగన్ పట్టిసీమ ను వట్టిసీమ చేశాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావటం వల్లే నదులకి జలకళ సంతరించుకుందన్నారు.గోదావరి, కృష్ణ నదుల అనుసందానం వల్ల కృష్ణా డెల్టా దిగువ భాగాన ప్రజలు, రైతులకు అవసరమైన తాగు, సాగునీటి కష్టాలు ఇబ్బందులు తొలిగాయన్నారు. కృష్ణా, గోదావరి పవిత్ర సంగమం చంద్రబాబు కష్టానికి ఫలితమని చెప్పారు. గత ప్రభుత్వం పంటల సంగతి కాదు కదా... కనీసం తాగటానికి నీళ్లివ్వండని మొరపెట్టుకున్నా కనికరించలేదన్నారు. ప్రతి సంవత్సరం సముద్రంలో వృథాగా కలుస్తున్న వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సఫలీకృతం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల పార్టీ అధ్యక్షుడు



రామినేని రాజ, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి జంపాల సీతారామయ్య, సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, తూర్పు కృష్ణా డెల్టా కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉయ్యూరు నరసింహారావు, జి కొండూరు మండల పార్టీ అధ్యక్షుడు పజ్జూరు వెంకయ్య, కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శీను లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెండవ రోజు పవిత్రోత్సవములు...



**జగ్గయ్యపేట,జులై 9,మేజర్ న్యూస్ :** పావన కృష్ణానది తీరమున ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రమైన స్వయంభూ శ్రీ పంచనారసింహ క్షేత్రమై నెలకొని యున్న వేదాద్రి గ్రామం, శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానములో స్వస్తిశ్రీ చాంద్రమాన విశ్వావసు నామ సంవత్సరము ఆషాడ శుద్ధ త్రయోదశి మంగళవారం నుండి జరుగుచున్న పవిత్రోత్సవములలో రెండవ రోజు బుధవారం ఉదయం గం. 7.00 ల నుండి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అకల్మషహోమము, అగ్నిమధనం, అగ్ని ప్రతిష్టాపన, పవిత్ర శుద్ధి, నవగ్రహ యజ్ఞం కార్యక్రమములు నిర్వహించబడినవి. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణఇందిరాదత్తు శ్రీ స్వామి వారి, అమ్మవార్లకు పట్టు వస్త్రములు సమర్పించినారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలియజేసారు.

## లక్ష్మీదేవి అమ్మవారికి ఆషాడం సారే సమర్పించుకున్న భక్తులు

**రెడ్డిగూడెం, జూలై 9, మేజర్ న్యూస్ :** స్థానిక రాజగోపాల స్వామి ఆలయం లో బుధవారం ఆషాడ మాసం సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారికి భక్తులు సారే సమర్పించుకున్నారు.. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల కూరగాయలు పండ్లు తో శాకాంబరి అలంకరణ చేశారు.. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో రాజగోపాల స్వామి ఆలయానికి చేరుకొని అమ్మవారికి సార సమర్పించుకున్నారు ఆలయ



అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దారా కోటేశ్వరరావు తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత.

గన్నవరం, జూలై 9, మేజర్ న్యూస్ : విద్యుత్ లైన్ల మరమ్మతు నిమిత్తం 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి శ్రీనివాసా ఫీడర్, 11 కెవి చిన్న అవుటపల్లి ఫీడర్ ట్రీ కటింగ్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును.



ఈ రోజు ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు మర్లపాలెం, విజయ మెడల్స్, వేపగుంట, మేఘన రోడ్, చిన్న అవుటపల్లి మొత్తం ఏరియా, ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

## ఘనంగా శాకాంబరి ఉత్సవ మహోత్సవములు.

**గన్నవరం, జూలై 9, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ గంగానమ్మ తల్లి ఆలయం లో బుధ, గురువరాల్లో శాకాంబరి ఉత్సవ మహోత్సవములు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా తొలిరోజు అమ్మవారిని ప్రత్యేకంగా కూరగాయలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త టంకాసాల సుబ్బారావు, వీరవెంకట శివశంకర ప్రసాద్-నాగరాజ కుమారి, కారంపూడి శ్రీనివాసరావు-కృష్ణకుమారి దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. రెండవ రోజు గురువారం సారె సమర్పణతో పాటుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రాంగణంలో కోలాటం, భక్త బృందంచే భజనలు నిర్వహించబడతాయని, భక్తులు అందరూ ఈపూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



# విజయవంతంగా కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె




**కంచికచర్ల జూలై 9 మేజర్ న్యూస్ :** కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఐఎఫ్టియు ఆధ్వర్యంలో కంచికచర్ల, వీరులపాడు మండలాల అనుబంధ సంఘాల కార్మికుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రధాన రహదారిపై కంచలమ్మ తల్లి గుడి దగ్గర నుండి నవరంగ్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈప్రదర్శనలో పాల్గొన్న ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి హరికృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఇనపనూర్తి విజయరావు, ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యులు తిరుమల శెట్టి సత్యనారాయణ, జీనెపల్లి స్వామి, మర్రిపూడి చిన్న మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సును కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కొమ్ముకాస్తున్న కొంతమంది శ్రేయస్సు కోసమే పనిచేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను బానిసలుగా చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్లను తయారుచేసి ఇబ్బందులకు గురిచేస్తుంది అన్నారు. గతంలో కార్మికులకు ఉపయోగపడే విధంగా ఉన్న చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కొడ్లను అమలు చేయాలని చూస్తున్న కేంద్రప్రభుత్వం కేంద్రం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆమోదం తెలియజేయడం దురదృష్టకరమైన ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సంఘటిత అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు ఉపయోగపడే విధంగా పనిచేయని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేస్తే అరెస్టులు చేసే విధంగా కార్మిక హక్కులను, ప్రయోజనాలను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఈ రోజున దేశవ్యాప్తంగా కార్మికులందరూ వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేస్తూ కార్మికుల ఐక్యతను కాపాడుకుంటూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు కాలవ వెంకట్రావు,లక్కిశెట్టి ఆంజనేయులు,బండారి శీను, బడేటి దాసు,కంచికచర్ల మండల కార్యదర్శి కాశి పోయిన రాంబాబు, కంభంపాటి శ్రీను,కీసర గండేపల్లి పెండ్యాల వేములపల్లి గ్రామ కమిటీ నాయకులు జీనేపల్లిస్వామి, కాకుమాను రామారావు,పరిటాల గ్రామ కమిటీ నాయకులు పులి శ్రీను మునియప్ప శివరాం మల్లి డొనాల్ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ప్రభారాణి, వనజాక్షి, వీర్లపాడు మండల అల్లూరు గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తిరుమల శెట్టి సత్యనారాయణ, నవలూరు కృష్ణయ్య తాటిగుమ్మి నాయకులు బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు విజయరావు, బోదవాడ జమ్మవరం గోగరాజు పల్లి గ్రామ కమిటీ నాయకులు దుర్గారావు,ఆనంద్,శివ రామారావు పెద్దాపురం, కొనతాలపల్లి గ్రామ కమిటీ నాయకులు నంద్రు రమేష్, షేక్ బాజీ, ఒంటిపులి రాజు, సయ్యద్ గాలిసా,ఉప్పుతల శీను, కృష్ణారావు, రాజు, శ్రీనివాసరెడ్డి, చరణ్, సోనాలి,జమున, భగవతి, కంచికచర్ల వీరులపాడు మండల భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




## గుడ్లవల్లేరులో..

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గుడ్లవల్లేరు మండల కేంద్రంలో అంగన్వాడీ, ఆశా, పంచాయతీ, ఆటో తదితర కార్మిక సంఘాలు సిఐటియు ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, మానవహారంలతో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రామిక మహిళ కృష్ణా జిల్లా కన్వీనర్ ధనశ్రీ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చాలని చూస్తున్నదని, 44 కార్మిక చట్టాలను యధాతధంగా కొనసాగించాలని, స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలని, పంచాయతీ కార్మికులకు సంబంధించి కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలని,ట్రాన్స్పోర్ట్ కార్మికులకు సంబంధించి సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని, పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని,బ్యాంకు లోన్ ద్వారా సబ్సిడీతో కొత్త వాహనాలు మంజూరు చేయాలని తదితర డిమాండ్ల సాధించేవరకూ పోరాటం చేస్తామన్నారు. జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గుడ్లవల్లేరు మండలంలో ఉన్న కార్మికులు అందరూ గుడ్లవల్లేరు సెంటరులో మానవహారం నిర్మించి, మండల ఆఫీస్ నుండి పంచాయతీ ఆఫీస్ వరకు భారీ ప్రదర్శనచేసి తమ డిమాండ్ల సాధనకోసం దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. ఈ ప్రదర్శనలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అమ్మాజీ, విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, ఆటో కార్మికులు నరేంద్ర, మోహన్, తదితర కార్మిక సోదర సోదరీలు భారీగా పాల్గొన్నారు.




## పామర్రు లో భారీ ర్యాలీ

**పామర్రు జులై 9 మేజర్ న్యూస్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పామర్రు మండలంలో అంగనవాడి, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, గ్రామపంచాయతీ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, ఆటో కార్మికులు తదితర రంగాల కార్మికులు, పామర్రు సిఐటియూ ఆఫీసు నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఓ.గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను, వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, స్కీం వర్కర్లు అందరిని కార్మికులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని, కేంద్రంలో మోడీ ఆదానీ, అంబానీ భజన చేస్తుంటే, రాష్ట్రం లో చంద్రబాబు నాయుడు మోడీ భజన చేస్తున్నారని, వీరిద్దరి తీరు మారక పోతే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకురాలు కె. ఉమారాణి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యమాలకు కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని, మన డిమాండ్స్ ప్రభుత్వం నెరవేర్చే వరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మజ, నాగ సావిత్రి, భూలక్ష్మి, ఇంటి రాజు, జె.రామస్వామి, రజక సంఘం జిల్లా కార్యదర్శి కె.నాగభూషణం, రామ్మోహనరావు, సిరికి వెంకటేశ్వరరావు, శివ నాగు, వెంకన్న పాల్గొన్నారు.

# అవనిగడ్డ రాజీవ్ గాంధీ చౌక్ వద్ద జాతీయ సమ్మె విజయవంతం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా పలు కార్మిక సంఘాల నేతృత్వంలో భారీ ప్రదర్శన ధర్నా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రమైన అవనిగడ్డ రాజీవ్ గాంధీ చౌక్ వద్ద జాతీయ సమ్మెలో భాగంగా 10 కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు వివిధ కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నినాదాలు చేశారు.కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు కార్మికులకు పనికి సమాన వేతనం కల్పించాలని వివిధ కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రాజీవ్ సెంటర్లో కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యాసం శ్రీనివాసరావు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్



నాయకులు అన్నపురెడ్డి నాగమణి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వై రమాదేవిలతో పాటు ఆటో వర్కర్స్ యూనియన్, కార్పెంటర్స్ అసోసియేషన్, ట్రక్కు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షాకాలం కోసం ఆయుర్వేద ఆహారం



**విజయవాడ మేజర్ న్యూస్ :** సరైన చర్మ ఆరోగ్యాన్ని, లోపల నుండి మొత్తం శ్రేయస్సును అందించడానికి సరళమైన సహజ నివారణలను ఆశ్రయించాలని ఆయుర్వేద నిపుణురాలు డాక్టర్ మధుమితకృష్ణన్ సిఫార్సు చేస్తున్నారు. బాదం, హెర్బల్ టీలు, పసుపు వంటి సహజ ఆహారాలను ఆహారంలో చేర్చడంతో పాటుగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంపై దృష్టి పెట్టాలని, బుద్ధిపూర్వక ఆహార ఎంపికలు చేసుకోవాలని ఆమె సిఫార్సు చేస్తున్నారు. “శుభ్రమైన ఆహారం వాత, పిత్త, కఫాలు అనే మూడు దోషాలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుందని ఆయుర్వేదం సూచిస్తుంది. బాదం వంటి పోషకమైన ఆహారాలను చేర్చండి. ఆహారంలో హెర్బల్ టీలను జోడించడానికి ప్రయత్నించండి. కాలానుగుణ పండ్లు, కూరగాయలను జోడించండి. ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలి. చర్మ ఆరోగ్యానికి సుగంధ ద్రవ్యాలను ప్రయత్నించండి. ఆరోగ్యకరమైన కొవ్వుల కోసం నెయ్యిని జోడించాలి” అని డాక్టర్ మధుమితకృష్ణన్ పేర్కొన్నారు.

## అత్యంత సన్నని, తేలికైన, అత్యంత మన్నికైన ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లను ఆవిష్కరించనున్న సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్

**విజయవాడ మేజర్ న్యూస్ :** దక్షిణ కొరియా టెక్ దిగ్గజం సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ ఈ నెల 9న న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో తమ తాజా ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేయడానికి సిద్ధమైంది. సామ్‌సంగ్ దాని సంస్కృతి, సృజనాత్మకత, సహకారానికి ప్రసిద్ధి చెందిన ప్రదేశంలో గెలాక్సీ పోర్ట్‌ఫోలియోకు తాజా, గొప్ప జోడింపులను చేయటం సముచితం. ఇప్పుడు ఏడవ తరంలో ఉన్న తమ రాబోయే ఫోల్డబుల్‌లు అన్నింటికంటే సన్ననివి, తేలికైనవి, అత్యంత మన్నికైనవిగా ఉంటాయని కంపెనీ సూచాయగా వెల్లడించింది. ఈ వారం చివర్లో బ్రూక్లిన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న కార్యక్రమంలో కంపెనీ డివైస్ ఎక్స్‌పీరియన్స్ డివిజన్ యాక్టింగ్ హెడ్ టిఎం రోహ్ వేదికపైకి వచ్చినప్పుడు, సామ్‌సంగ్ ప్రస్తావించనున్న కీలక అంశాలు ఇవే. తమ ఇంజనీర్లు, డిజైనర్లు గెలాక్సీ జెడ్ సిరీస్‌లోని ప్రతి తరాన్ని మునుపటి కంటే సన్నగా, తేలికగా, మన్నికగా ఉండేలా మెరుగుపరుస్తున్నారని కంపెనీ ఇటీవల తెలిపింది.

## చెక్ బౌన్స్ కేసులో రియల్టర్‌కు ఏడాది జైలు శిక్ష

**విజయవాడ మేజర్ న్యూస్ :** చెక్ బౌన్స్ కేసులో రియల్ ఎస్టేట్ వ్యాపారి కుదరవల్లి వెంకట నర్సయ్యకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధించింది ఫస్ట్ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు. వివరాల్లోకి వేలితే బోడి సీతారామరాజు వద్ద 2020 సంవత్సరంలో కుదర వల్లి వెంకట నరసయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి 15 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత 2021 వ సంవత్సరంలో బోడి సీతారామరాజుకు 17 లక్షల 70 వేల చెక్‌ను ఇచ్చాడు రియల్ ఎస్టేట్ వ్యాపారి. అయితే ఆ చెక్ బౌన్స్ అవ్వడంతో సీతారామరాజు కోర్టును ఆశ్రయించాడు. దీంతో ఇరువురి న్యాయవాదుల వాదనలు విన్న ఫస్ట్ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కుదరవల్లి వెంకట నరసయ్యకు ఏడాది జైలుశిక్ష, 2వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

## లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలి



**మొవ్వ జూలై 9 మేజర్ న్యూస్ :** దేశ వ్యాప్త కార్మిక సంఘాల పిలుపుమేరకు బుధవారం మొవ్వ మండలంలో పలు కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె నిరసన కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా పెదపూడి వంతెన దగ్గర నుంచి కూచిపూడి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ ను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, గ్రామపంచాయతీలో ఉన్న టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, 10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, పిఎఫ్, గ్రాడ్యుటి ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలని పలు కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం నారాయణరావు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి డి రాజారత్నం వేదవతి, బొల్లా సుబ్రహ్మణ్యం లంకపల్లి విజయ లక్ష్మి, వెంకటలక్ష్మి, అనిత, శివకుమారి, దేవమణి తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీ పనులపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమీక్ష

అవనిగడ్డ, మేజర్ న్యూస్ : నియోజకవర్గంలో చేపట్టిన డ్రైనేజీల పనులు సమర్ధవంతంగా చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో డ్రైనేజీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లింగన్నకోడు కిక్కిస తొలగింపు, గుండేరు పూడికతీత పనులు జరుగుతున్న తీరు అధికారులు వివరించారు. కృష్ణాపురం - నరసింహాపురం కిక్కిస తొలగింపు పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎస్.డీ.ఎం.ఎఫ్, ఓ అండ్ ఎం పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్రైనేజీ శాఖ ఈఈ బీ కిరణ్ బాబు, డీఈఈ జే.బాబు నాయక్, ఏఈఈలు అబ్దుల్ కరీం, చిరంజీవి పాల్గొన్నారు.

## రొయ్యూరు పిఎసిఎస్ అధ్యక్షునిగా 'లుక్కా' నియామకం



**తోట్లవల్లూరు జులై 9 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రొయ్యూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గా లుక్కా రేణుకారావు నియమితులయ్యారు. ప్రాథమిక సహకార సంఘాలకు నాన్ అఫీషియల్ పర్సనల్ ఇంచార్జ్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మండల పరిధిలోని రొయ్యూరు పి.ఎ.సి.ఎస్‌కు మాత్రమే కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా లుక్కా రేణుకారావుతో పాటు సభ్యులుగా లుక్కా శివనాగబాబు, మోర్ల వెంకటప్పయ్యలను నియమించారు. చైర్మన్‌గా నియమితులైన రేణుకారావు ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ మండల ప్రధానకార్య దర్శిగా పనిచేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికలలో జడ్పిటిసి సభ్యునిగా పార్టీ తరఫున ఆయన పోటీ చేశారు. కాగా ఈ కమిటీలో నియమితులైన ముగ్గురూ ఒకే సామాజిక వర్గానికి (బిసి, గౌడ) చెందినవారు కావడం విశేషం.

## డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ




**పమిడిముక్కల జూలై 9 మేజర్ న్యూస్ :** డెంగ్యూ నివారణ మాసోత్సవంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని లంకపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు చెందిన వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధి నివారణపై డాక్టర్ కె.అఖిల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డెంగ్యూ వ్యాధికి కారణమైన దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, అలాగే వ్యాధి సోకకుండా అనుసరించాల్సిన పద్ధతులను ఆమె వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలు గూర్చి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 104 వాహనం ద్వారా 68 మందికి వైద్య సేవలను కూడా అందించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా ఆలస్యం చేయకుండా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని డాక్టర్ అఖిల విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అఖిల తో పాటు ఎం.ఎల్.హెచ్.పి వై.స్వాతి ఏఎన్ఎం వి. వసంత, సూపర్ వైజర్ కె.కృష్ణమోహన్, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పీజీ సెట్‌లో ర్యాంక్ సాధించిన శ్రీజ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఏపీ పీజీ సెట్ ఎంట్రన్స్ పరీక్షలలో నాలుగో స్థానం సాధించిన దేవన బోయిన శ్రీజను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది అభినందనలు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022- 25 బ్యాచ్ బి.ఎ. గ్రూపు చదివిన శ్రీజ ఏపీ పీజీ సెట్- 2025 ప్రవేశ పరీక్షలో అర్ధశాస్త్ర విభాగంలో రాష్ట్రస్థాయిలో నాలుగవ స్థానం సాధించినందుకు సంతోషిస్తున్నామని ప్రిన్సిపాల్ డా.డి.ఉమారాణి తెలిపారు. ఈ సందర్భంగా డిపార్ట్మెంట్ ఆఫ్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో శ్రీజని సత్కరించారు. శ్రీజ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులందరూ అత్యున్నత విజయాలను సాధించాలని ప్రిన్సిపాల్ డాడి ఉమారాణి అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల బియ్యం బొక్కిన పేర్ని నాని నీతులు చెప్పడం హాస్యాస్పదం



**అవినీతి కేసుల్లో బెయిల్‌పై ఉన్న వారు నీతులు మాట్లాడటం ఆశ్చర్యం**

**మేం గేట్లు తెరిస్తే వైసీపీ క్షణంలో ఖాళీ అవుతుంది**

**మాకు మా కార్యకర్తలు, నాయకులు ముఖ్యం.. మీ స్క్రాప్ మాకెందుకు**

**గంజాయి బ్యాచ్‌తో చప్పట్లు కొట్టించుకున్నంత మాత్రాన పేర్ని హీరో కాలేడు**

**అబద్దాలు చెప్పి ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తే చూస్తూ ఊరుకోం... మచిలీపట్నం టీడీపీ నేతలు**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** అబద్దాలు, అవినీతి ఆరోపణలతో ప్రజల్లో కలహాలు సృష్టించాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదని మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పేర్ని నాని, పేర్ని కిట్టూ వ్యాఖ్యల్ని తప్పుబట్టారు. తప్పుడు ఆరోపణలు చేయడం తప్ప పేర్ని నానికి, పేర్ని కిట్టూకి మరేదీ చేతకాదన్నారు.మున్సిపల్ వైస్ ఛైర్మన్ పంచపర్వాల కాశి విశ్వనాథం మాట్లాడుతూ.గంజాయి బ్యాచ్‌ను వెంటేసుకుని తిరిగే పేర్ని నాని, పేర్ని కిట్టు భజనలు చేయడం తప్ప కొల్లు రవీంద్రను ఏమీ చేయలేరు.గంజాయి బ్యాచ్ తో చప్పట్లు కొట్టించుకోవడం తప్ప పేర్ని నాని బందరుకి చేసిందేమీ లేదు. రవీంద్ర గురించి మాట్లాడే అర్హత లేదు. గెలిచిన తొలిసారే మంత్రిగా కొల్లు రవీంద్ర ప్రమాణ స్వీకారం చేశారు.ఆ రోజు నుండే నియోజకవర్గం కోసం సాయ శక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇన్ని సార్లు మంత్రిగా ఉండి కూడా నియోజకవర్గానికి చేసిందేమైనా ఉందా? 41 మంది కౌన్సిలర్లున్నారు.. ఒక్కర్ని తీసుకున్నా వదిలేది లేదంటున్నావు. ఆ దొంగల్ని తీసుకుని మేమేం చేసుకోవాలి. మాకు కావాల్సినంత బలం.. మా కార్యకర్తల సత్తా మాకు చాలు. ఆ స్క్రాప్ మొత్తాన్ని తెచ్చుకుని మేమేం చేసుకోవాలి. నీతి నిజాయితీ కలిగిన మా కార్యకర్తలు మాకు చాలు.టీడీపీ సీనియర్ నాయకులు మార్కెటింగ్ యాడ్ చైర్మెన్ కుంచె దుర్గాప్రసాద్.వైసీపీ నేతలు, దొంగలు మాట్లాడుతూ.. కొల్లు రవీంద్ర గురించి మాట్లాడడం హాస్యాస్పదం. నేలకు ముక్కు రాస్తానని చెప్పినోళ్లు తర్వాత తూచ్ అనడం వాస్తవం కాదా? కొడుకు గంజాయి దొంగ.. తండ్రి బియ్యం దొంగ. గత ఐదేళ్లలో ఏం చేశారో.. అంతకు ముందు కొల్లు రవీంద్ర ఏం చేశారో చర్చకు సిద్ధమా? చెట్లు నరికేసి, ఇళ్ల పట్టాల పేరుతో భూములు దోచుకోవడం, అక్రమంగా మట్టి తవ్వుకుని దోచుకోవడం, గంజాయి అమ్మకాలతో ప్రజల జీవితాలను నాశనం చేయడం తప్ప మీరు సాధించిందేమంటి? గంజాయి బ్యాచ్ వెంటేసుకుని తిరిగినంత మాత్రాన మీరు తోపులనుకుంటున్నారా? మీలా కక్ష పూరితంగా అరెస్టు చేయాలనుకుంటే క్షణం పట్టదు. తప్పు చేయనప్పుడు ముందస్తు బెయిల్ ఎందుకు తెచ్చుకున్నారో సమాధానం చెప్పాలి. బందరులో నీవు చేసిన ఒక్క అభివృద్ధి చూపించగలవా? కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలో గుంతలు లేని రోడ్లను సాకారం చేసి చూపించాం.నిజంగా మీ పార్టీ నాయకుల్ని చేర్చుకోవాలనుకుంటే క్షణం చాలు. మా కార్యకర్తల అభీష్టం మేరకు వైసీపీ నేతల్ని చేర్చుకోవడం లేదు. మా కార్యకర్తలకు న్యాయం చేయడం మాకు ముఖ్యం. అడ్డగోలుగా వాగితే ఊరుకునేది లేదని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అవాస్తవాలను అలవోకగా చెప్పడంలో పేర్ని నాని పీహెచ్‌డీ చేశాడు. తెలుగుదేశం పార్టీ నుండి గెలిచిన సర్పంచి మెడలో వైసీపీ కండువా వేసి.. టీడీపీ క్యాడర్ మొత్తాన్ని తీసుకెళ్లిపోయినట్లు మాట్లాడడం హాస్యాస్పదం. కౌన్సిలర్లను, సర్పంచుల్ని తీసుకెళ్లండి మా సత్తా చూపిస్తామని చెప్పడం హాస్యాస్పదం. మీరు ఎంత మంది ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి 52 వేల మెజార్టీతో గెలిచారంటే.. మీరేంటో, మీ బలమేంటో తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. కొల్లు రవీంద్రపై విమర్శలు చేయడమంటే.. ఆకాశంపై ఉమ్ము వేయాలనుకోవడమేనన్నారు. ఇన్నేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ బందరుని పేర్ని నాని కనీసం అభివృద్ధి చేయలేదు. కానీ కొల్లు రవీంద్ర అధికారంలోకి వచ్చిన రోజు నుండి.బందరు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారు. మీరెన్ని అభాండాలేసినా.. కొల్లు రవీంద్ర నీడను కూడా తాకలేరని హెచ్చరించారు.

మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఖాజా మాట్లాడుతూ.. అవినీతి గురించి పేర్ని నాని ఛాలెంజ్ చేయడం ఆశ్చర్యంగా ఉంది. నీ అవినీతిని ప్రజలు గుర్తించి మిమ్మల్ని 52 వేల ఓట్ల తేడాతో చిత్తు చిత్తుగా ఓడించారు. మా నాయకుడు మాకిచ్చిన సంస్కారం అది. 45 మంది కార్పొరేటర్లు, 20కి పైగా సర్పంచులు వైసీపీ తరఫున ఉన్నప్పటికీ బందరులో ఘోరంగా ఓడిపోయారంటే ప్రజలు ఎంతగా విసిగిపోయారో తెలుసుకోండి. ఎక్కడెక్కడో దాక్కున్నానని చెబుతున్న పేర్ని నాని ఎందుకు పారిపోవాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలి. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసి. ఇంట్లో మహిళల్ని కూడా బజారుకీడ్చిన పేర్ని నాని కొల్లు రవీంద్ర గురించి మాట్లాడడం హాస్యాస్పదం. కొల్లు రవీంద్రను తప్పుడు కేసుల్లో ఇరికించడం తప్ప చేసిందేమీ లేదు. పేర్ని నాని, అతని కొడుకుని అరెస్టు చేస్తే అవినీతి మొత్తం గురించి తప్పించుకోవచ్చని భావిస్తున్నారు. కానీ మిస్టర్ పేర్ని నానీ.నీ అరాచకాలన్నింటికీ ఉచ్చు బిగిస్తున్నాం. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి కూడా బందరుని కనీసం పట్టించుకోకుండా పేర్ని నాని దోచుకుతిన్నాడు. కానీ కొల్లు రవీంద్ర అధికారంలోకి వచ్చిన రోజు నుండి బందరు అభివృద్ధి కోసమే ప్రయత్నిస్తున్నాడు. ఇలాగే ఆరోపణలు చేస్తూ కాలం నెట్టుకురా. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టబోం. చట్ట ప్రకారం శిక్షించి తీరుతామని హెచ్చరించారు. క్లస్టర్ ఇంఛార్జి తలారి సోమశేఖర్ మాట్లాడుతూ.. వైసీపీ నేతలు నీతులు చెబుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు. వైసీపీ కౌన్సిలర్లను తీసుకుంటే సత్తా చూపిస్తామంటున్నారు. మాకు వారెవ్వరూ అవసరం లేదని పేర్ని నాని తెలుసుకోవాలి. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పాలనను ప్రజలంతా హర్షిస్తున్నారు. సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజాపాలన అమలు చేస్తున్నాం. మీ కల్లబొల్లి మాటలు నమ్మేందుకు ప్రజలెవ్వరూ సిద్ధంగా లేరని ఎద్దేవా చేశారు.

*గురువారం జూలై 10 వతేదీన గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కథనం..*

# ఆధ్యాత్మికతకు పెన్నిధి - జ్ఞానసాయి సన్నిధి









**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలోని అంగలూరు శ్రీ మహాగణపతి ప్రయుక్త శ్రీ దత్తాత్రేయ సహిత జ్ఞానసాయి మందిర ప్రాంగణంలో తాజుద్దీన్ బాబా వారి తాజ్‌దర్బార్ ఒకేచోట కొలువయ్యాయి. ఈ అరుదైన ఆధ్యాత్మిక కేంద్రం దినదినం ప్రవర్ధమానం. జిల్లాలోని నలుమూలల నుంచి ఈ అరుదైన ప్రాంగణానికి భక్తులు అధికసంఖ్యలో విచ్చేస్తారు. గురువారం శ్రీ జ్ఞానసాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకల్ని వైభవంగా నిర్వహించనున్నారు. అంగలూరు షిరిడీ సాయి సేవా సంఘం ప్రధాన నిర్వాహకుడు యలమంచిలి నాగమోహన్, లక్ష్మి దంపతులు 2006లో జ్ఞానసాయి మందిరాన్ని నిర్మించేందుకు పూనుకున్నారు. అనతి కాలంలోనే 2007 జనవరి 28న ప్రారంభించారు. ఇదే ప్రాంగణంలోనే 2009 జనవరి 28న తాజ్‌కుటీర్ అద్దాల మండపాన్ని నిర్మించారు. మహారాష్ట్రలోని నాగపూర్ ప్రాంతంలో మరో సాయిబాబాగా ప్రసిద్ధి పొందిన తాజుద్దీన్ అవధూతను ఈ కుటీర్‌లో ప్రతిష్టించారు. భక్తులు తమ రూపాన్ని కోటి అద్దాల్లో చూసుకునేలా రాజస్థాన్‌కు చెందిన చేయి తిరిగిన కళాకారులు ఈ మండపాన్ని తీర్చిదిద్దారు. కుటీర్‌లో అనేకమంది అవధూతల చిత్రపటాలు భక్తులకు దర్శనమిస్తున్నాయి. రెండు అంతస్తుల అన్నదాన కేంద్రంలో వంటచేసే సాయి, ఆశీనులైన బాబావారి పాలరాతి ప్రతిమలు భక్తుల్ని ఆకట్టుకుంటున్నాయి. నిత్య అన్నదాన క్యారేజీలను ఇంటింటికీ ఇక్కడి నుంచే పంపుతున్నారు. ప్రతి గురువారం భక్తులకు అన్నసమారాధనను నిర్వహిస్తున్నారు. పల్లకీపై స్వామివారి గ్రామోత్సవం, స్వామీజీలచే యజ్ఞయాగాదులు జరుగుతున్నాయి. ప్రతినెలా తాజుద్దీన్ బాబాకు చందనాభిషేకం నిర్వహించటం జరుగుతుంది. చందనాన్ని కులమతాలకతీతంగా స్థానిక ముస్లిం భక్తులు తీసుకువస్తారు. పరిసర ప్రాంతాల భక్తులతో పాటు హైదరాబాదు, గుంటూరు, ఏలూరు, పాలకొల్లు, గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. గ్రామీణ ప్రాంతం కావటంతో ఆలయ ప్రాంగణమంతా ఆహ్లాదకరంగా ఉంటూ ఆధ్యాత్మికతకు పెన్నిధిగా జ్ఞానసాయి సన్నిధి విరాజిల్లుతోంది.

# నందిగామలో జర్నలిస్టుల ప్రదర్శన విజయవంతం



నందిగామ, జులై 9, మేజర్ న్యూస్: జులై 9వ తేదీన సార్వత్రిక సమ్మెలో భాగంగా నందిగామలో బుధవారం నందిగామలో జర్నలిస్టుల ప్రదర్శన జయప్రదం అయింది. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా నాయకులు ఆకుల వెంకటనారాయణ బుధవారం మీడియా తో మాట్లాడుతూ జర్నలిస్టులు చట్టం వేతన చెల్లింపు చట్టాలను పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్నారు. నందిగామ రెవిన్యూ డివిజన్ పరిధిలో కొంత మంది జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగామలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వంలో తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టు రక్షణ కొరకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కమిటీలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఏపీ బీజేఏలకు ప్రాతినిధ్యం కల్పించిందని తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టేందుకు హోమ్ మంత్రి శాఖ ఆధ్వర్యంలో హై పవర్ కమిటీ జిల్లా పోలీసు అధికారులతో కూడిన కమిటీలు నామమాత్రంగా ఉన్నాయని వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ కు 50 కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని కోరారు. మీడియా అకాడమీ బలపితం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేట సమాచార శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టు జర్నలిస్టులకు ఇవ్వాల్సిన అవార్డులను కొన్ని సంవత్సరాలకు ఇవ్వడం లేదని తక్షణమే జర్నలిస్టులు అవార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జర్నలిస్టులకు కార్మిక భీమా సదుపాయం గుర్తింపు చేయాలని, ఆరోగ్య భీమా సదుపాయం కూడా అమలు చేయాలని కోరారు. జర్నలిస్టులకు వయోభారం నిండిన తర్వాత వారి యొక్క స్థితిగతులను అవసరాలను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రాల్లో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని కోరారు.

## మండలంలో నాలుగు పిఏసిఎస్‌లకు కమిటీల నియామకం






పమిడిముక్కల జులై 9 మేజర్ న్యూస్ : పమిడిముక్కల మండల పరిధిలోని నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీ లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలు నాన్ అఫీషియల్ పర్సన్ ఇంచార్జ్ కమిటీలుగా కొనసాగుతాయి. మండల పరిధిలో నాలుగు సహకార సంఘాలకు పాలకవర్గాలను ప్రకటించగా అందులో కృష్ణాపురం, గురజాడ సహకార సంఘాలకు తెలుగుదేశం పార్టీ, చోరగుడి, ధూళిపూడి పాలెం సహకార సంఘాలకు జనసేన పార్టీలకు చెందిన వారు చైర్మన్ లుగా నియమితులయ్యారు. కృష్ణాపురం సహకార సంఘం అధ్యక్షునిగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సభ్యులుగా ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, కొండవీటి సుజాత నియమితులయ్యారు. గురజాడ సహకార సంఘానికి అధ్యక్షునిగా కొండేటి సత్యనారా యణ, సభ్యులుగా మేరుగ శివరామకృష్ణ ప్రసాద్, కూచిపూడి సావిత్రమ్మ, చోరగుడి సహకార సంఘం చైర్మన్ గా తోట వెంకటేశ్వరరావు, సభ్యులుగా దాసరి కృష్ణారావు, మీర్జా నవరక్ ఆలీ, ధూళిపూడిపాలెం సంఘం అధ్యక్షునిగా పాలేటి పార్థసారథి, సభ్యులుగా పులి గురుప్రసాదరావు, ఉమ్మడిశెట్టి చంద్రమ్మ నియమితులయ్యారు.

## రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట, జులై 9,మేజర్ న్యూస్ : జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య బుధవారం అమరావతిలోని సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని కీలక రహదారుల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పనులకు జెట్ వేగం వచ్చిందని, ప్రజలకు ప్రాధాన్యమిస్తూ ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని" తెలిపారు. ముఖ్యంగా పల్లె ప్రజలకు అవసరమైన రోడ్లు మెరుగుపడితే, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.నిధుల కోసం ప్రతిపాదించిన ప్రధాన రహదారులు:చిల్లకల్లు - వేదాద్రి -బండిపాలెం - కొనకంచి రహదారి. షేర్ మహమ్మద్‌పేట - గండ్రాయి రహదారి.జగ్గయ్యపేట పట్టణం - షేర్ మహమ్మద్‌పేట రహదారి. ఈ రహదారుల అభివృద్ధి కోసం రూ.11.20 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలతో కూడిన లేఖను మంత్రి కి అందజేశారు. దీనిపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, "విషయాన్ని ప్రాధాన్యతతో పరిశీలించి వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేస్తాం" అని హామీ ఇచ్చారు.



# పేదల పక్షపాతి సీఎం చంద్రబాబు : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



నందివాడ,మేజర్ న్యూస్: పేదల పక్షపాతి సీఎం చంద్రబాబు అని, పేద వర్గాల ఉన్నతికి ఎన్టీఆర్ స్ఫూర్తిని సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక)లో... నియోజకవర్గ పరిధిలోని 36 బాధిత కుటుంబాలకు రూ.20.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు,, ఎల్ఓసి పత్రాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కూటమి నాయకులతో కలిసి బుధవారం మధ్యాహ్నం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు సీఎం చంద్రబాబు కు,ఎమ్మెల్యే రాముకు ధన్యవాదాలు తెలిపారు. పలువురు బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కష్టకాలంలో అండగా ఆదుకున్నారంటూ ఎమ్మెల్యే రాము చేతులు పట్టుకొని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్రంలోని పేదవర్గాల సంక్షేమమే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనారోగ్య సమస్యలతో కష్టకాలంలో ఉన్న పేదవర్గాలకు భరోసాగా ఏడాది పాలనలోనే 490 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు మంజూరయ్యాయన్నారు. గుడివాడ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో రెండు కోట్ల 14 లక్షల చెక్కులు ఇప్పటివరకు అందించినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు.రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన ప్రజల కష్టాలను, ప్రణాళిక బద్ధంగా పరిష్కరించేందుకు చంద్రబాబు తీసుకుంటున్న అనేక చర్యలు విజయవంతమై పేద వర్గాల ఉన్నతికి చేయూతనిస్తున్నాయన్నారు. ఈ మేరకు ఇప్పటికే వృద్ధ వికలాంగ పెన్షన్లు పెంచడమే కాకుండా, సూపర్ సిక్స్ హామీలను వడివడిగా అమలు చేస్తుండటాన్ని మనందరం చూస్తున్నామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. పేద వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుతానని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అబ్జర్వర్ నూకాలమ్మ, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, సీనియర్ టిడిపి నాయకులు లింగం ప్రసాద్, పార్టీ నాయకులు నెరుసు కాశీ, నిమ్మగడ్డ సత్య సాయి, పోలాసీ ఉమ్మయ్య, గూదూరు సురేంద్ర, సిరిపురపు తులసీ రాణి, పెద్దలింగాల టిడిపి నాయకులు వీరభద్ర రావు, సాయన పుష్పవతి, వడ్లమన్నాడు టిడిపి నాయకులు గరికిపాటి రాంబాబు, కాలింగపేట టిడిపి నాయకులు సింగవరపు ప్రభాకర్, తమిళ్ శెట్టి టిడిపి నాయకులు తోట వెంకటేశ్వరరావు, 11వ వార్డు టిడిపి నాయకులు మల్లికా బేగం, కూరాడ గ్రామ టిడిపి నాయకులు, ఏడవ వార్డు టిడిపి నాయకులు తేనేటి ఏడుకొండలు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, 33వ వార్డు టిడిపి నాయకులు కోడూరు ప్రభు బాధిత కుటుంబ సభ్యులు, టిడిపి అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగులో చైర్మన్ కృష్ణకుమారి



నందిగామ, జులై 9, మేజర్ న్యూస్: ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశాలతో, కూటమి ప్రభుత్వ పాలనలో " సుపరిపాలనలో తొలి అడుగు 4.1" కార్యక్రమంలో భాగంగా నందిగామ పట్టణ పరిధిలోని స్థానిక 13 వ వార్డు, 10 వార్డులో 2 వరోజు నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాజా, యార్లగడ్డ వెంకటేశ్వర రావు గద్దె రమేష్, నరసింహారావు, దాసరి సత్యం, బూత్ కన్వీనర్ రాటకొండ రమణ, పూర్ణచంద్రరావు తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిపై శిక్షణలో పాల్గొన్న బిఎల్వోలు



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : గుడివాడ నియోజకవర్గ బూత్ లెవల్ ఆఫీసర్ల (బిఎల్వోలు)కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో గుడ్లవల్లేరు మండలంలోని 49 మంది బిఎల్వోలు పాల్గొని విజయవంతంగా శిక్షణను పొందారు. గుడివాడ మున్సిపల్ కౌన్సిల్ హాల్ వద్ద గుడ్లవల్లేరు తహశీల్దార్ బి.లోకరాజు శిక్షణ నిర్వహిస్తూ బిఎల్వోల బాధ్యతలు, ఫారం 6, 7, 8, 8సి నింపే విధానం, గణాంక పద్ధతులు, గరుడ యాప్ వినియోగం, నజరీ మ్యాప్ వివరణ, ఎన్నికల నియమావళి గురించి వివరించారు. అలాగే బిఎల్వోల భాగస్వామ్య ప్రశంసనీయం అంటూ శిక్షణలో భాగంగా ప్రాక్టికల్ సన్నివేశాలు, ఫారం నమూనాలు, చట్ట విభాగాలపై వివరాలు డిజిటల్ స్క్రీన్ పై అందించారు. కార్యక్రమంలో డిటి రత్నకుమారి, ఆర్ఐ హనుమంతరావు, బిఎల్వోలు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను అమలుపరుస్తున్న కూటమి ప్రభుత్వం



నందిగామ, జులై 9, మేజర్ న్యూస్: నియోజకవర్గం చందర్లపాడు మండలం చందర్లపాడు గ్రామములో 5వ వార్డు మెయిన్ బజార్ లో సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరబాబు ప్రతి ఇంటికి ప్రతి షాప్ కు కరపత్రాన్ని అందజేసి కోటమీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈకార్యక్రమములో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల సుధాకర్, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బొందల రామకృష్ణ, జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు, షేక్ సైదా, చందర్లపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వర్రావు,మండల పార్టీ ఉపాధ్యక్షులు గుత్తికొండ శ్రీరామ్మూర్తి,గుడిమెట్ల తారక రామ ఎత్తిపోతల పథకం అధ్యక్షులు మన్నెం సాంబశివరావు,తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పెదపారుపూడిలో కార్మికుల నిరసన ర్యాలీ




పెదపారుపూడి జులై 9 మేజర్ న్యూస్ : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన పెదపారుపూడి లో నిరసన ర్యాలీ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అంగన్ వాడి కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశా కార్యకర్తలు తదితరులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.



## వైసీపీ నాయకులు రమేష్‌కు పలువురి పరామర్శ

**పమిడిముక్కల జులై 9 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం చోరగుడి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు బాసు రమేష్ అనారోగ్యానికి గురై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆ పార్టీ నాయకులు పలువురు బుధవారం ఆయనను పరామర్శించారు. రమేష్ అనారోగ్యానికి గురైన విషయం తెలిసిన మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు రమేష్ ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్సీపి మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ బాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ సభ్యులు గుర్విందపల్లి వంశీ, జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి బోసు బాబు, మండల పార్టీ ఉపాధ్యక్షులు పాతూరి చంద్రపాల్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గొర్కిపూడి బుజ్జి, నాయకులు మర్రి బాబురావు, అక్కినేని సతీష్, ముళ్లపూడి నాగార్జున, చావాల అనుదీప్ వర్మ, లోకం నరేష్, గోనెపల్లి రాజు, అడపా శివరామకృష్ణ ఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కరుణకుమార్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి



**పామర్రు జులై 9 మేజర్ న్యూస్:** పామర్రు టౌన్ సాయిన గర్‌లో బుధవారం జరిగిన శీలం కరుణ కుమార్ ఆదరణ కూడికలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రావెల్ల కిషోర్ బాబుతో కలిసి కరుణకుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు చాట్ల రమేష్, వర్ల చాణిక్య, మాజీ ఎంపీపీ దేవరపల్లి కోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జోయరత్న పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**పామర్రు జులై 9 మేజర్ న్యూస్:** పామర్రు మండలం బల్లిపర్రు గ్రామంలో పదవ తరగతి విద్యార్థి కలపాల జోయరత్న(15) కురుమద్దాలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా పార్థివదేహానికి స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును మృతుని తండ్రి జేమ్స్ ను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న జేమ్స్ ను ఈ సందర్భంగా ఆయన ఓదార్చి ధైర్యవచనాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు స్థానిక గ్రామ సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్, పార్టీ నాయకులు చాట్ల రమేష్, వర్ల చాణిక్య తదితరులు పాల్గొన్నారు.

### ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ హైస్కూల్ వేదికగా

## గుడ్లవల్లేరులో "మెగా పేరెంట్స్ & టీచర్స్ మీటింగ్"

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జూలై 09 :** గుడ్లవల్లేరు ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ హైస్కూల్‌లో జూలై 10 గురువారం 9 గంటలకు ఎంఇఓలు జి.జగన్మోహనరావు, జి.గోపాలరావుల పర్యవేక్షణలో "మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్" నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విఏ కుంజుమన్ తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్రాంత మచిలీపట్నం అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శాయన సుశీలరావు, విశిష్ట అతిథులుగా సాక్షీభూత ప్రభుత్వోద్యోగులు గుడ్లవల్లేరుపంచాయితీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు, గ్రంథాలయ సంస్థ గుడ్లవల్లేరు శాఖాధికారిణి టి. వాణి విచ్చేయనున్నారని తెలిపారు. ఎల్.కె.జి. నుండి 10వ తరగతి వరకు అందరు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ వ సదాశయాన్ని, మా ప్రయత్నాన్ని విజయవంతం చేయాలని స్కూల్ యాజమాన్యం, డైరెక్టర్ ఎన్. శ్రీనివాస మూర్తి, ప్రిన్సిపాల్ విఏ కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జి. సత్తిబాబు, స్టాఫ్ ఆహ్వానం తెలిపారు.

# గుడ్లవల్లేరు గంజాయి విక్రయ ముఠా అరెస్టు, రిమాండ్




**7 గురు గుడ్లవల్లేరు యువకులు, పశ్చిమ బెంగాల్ యువకుడు సొంతో ముండా అరెస్ట్**

**టెక్నికల్ ఎవిడెన్స్‌తో నిఘావేసి పట్టుకున్న గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది**

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు గంజాయి ముఠాను చాకచక్యంగా అరెస్టు చేసి కోర్టుకు పంపగా రిమాండ్ విధించి నెల్లూరు జిల్లా జైలుకు తరలించినట్లు గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయికి బానిసలై పొరుగు రాష్ట్రం వారి వద్ద గంజాయిని తక్కువ ధరకు తెచ్చి గుడ్లవల్లేరు చుట్టుపక్కల యువకులకు అలవాటు చేసి వారి జీవితాలను పాడు చేస్తున్నారనే సమాచారం గుడ్లవల్లేరు పోలీసులకు అందింది. దీంతో గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ టెక్నికల్ ఎవిడెన్స్ తో నిఘావేసి గంజాయి విక్రయిస్తున్న 6 గురు గుడ్లవల్లేరు యువకులు 1.బంకురు కొండలరావు, 2.మెరుగు జాన్ బాబు ఏ జాన్ రావు, 3.మత్తే ప్రకాష్, 4.బొడ్డు సురేంద్ర, 5.బడుగు భవాని శంకర్, 6.కోటే భార్గవ్‌లపై చాకచక్యంగా దాడిచేసి పట్టుకున్నారు. వారి వద్ద గంజాయి సరఫరాచేసే వ్యక్తి సమాచారం తెలుసుకుని గుడివాడ డిఎస్పీ ధీరజ్ వినీల్, రూరల్ సిఐ సోమేశ్వరరావు పర్యవేక్షణలో టెక్నికల్ బృందం, రెవెన్యూ సిబ్బంది సహకారంతో గంజాయి సరఫరా చేసే పశ్చిమ బెంగాల్ యువకుడు సొంతో ముండా, మరో గుడ్లవల్లేరు యువకుడు కొండా రాకేష్ లను గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పట్టుకున్నారు. 7 గురు గుడ్లవల్లేరు యువకులు, పశ్చిమ బెంగాల్ యువకుడు సొంతోపై కేసులు నమోదుచేసి, కోర్టుకు పంపగా 15 రోజులు రిమాండ్ విధించి నెల్లూరు జైలుకు తరలించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా యువకులు చెడు వ్యసనాలకు, మాదక ద్రవ్యాలకి బానిసలై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచిస్తూ, మాదక ద్రవ్యాల కొనుగోలు, అమ్మకాలు, వినియోగం పట్ల నిరంతరం నిఘా ఉంటుందని, వారిపై కఠిన చర్యలు ఉంటాయని గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ హెచ్చరిక చేసారు.

## మాఫియా జిల్లాగా మారుస్తున్న కూటమి ప్రభుత్వం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లాను మాఫియా జిల్లాగా మార్చిన కూటమి ప్రభుత్వం జిల్లాను మోడల్ జిల్లాగా మారుస్తామని మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని వైసీపీ అభిమాని యువ నేత బడే గౌతం అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూపి4, విజన్ 2047 విజయాలకు కేంద్రంగా కృష్ణా జిల్లాను మారుస్తాం అంటున్న టీడీపీ నేత రవీంద్ర అవనిగడ్డ నియోజకవర్గానికి టీడీపీ తరపున కనీసం ఒక ఇన్‌చార్జ్‌ను కూడా నియమించలేక పోయిందని, 2047 కైనా ఇంచార్జ్ ను నియమిస్తారో లేదో టీడీపీ కే తెలియదని గౌతమ్ అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మొన్న అవనిగడ్డలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా జిల్లా ప్రతిష్టను గత ప్రభుత్వం నాశనం చేసింధని ఆరోపించటం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణా జిల్లా అభివృద్ధి ముసుగులో మాఫియా గడ్డగా మారిపోయిందని,?కృష్ణా జిల్లాను మోడల్ జిల్లాగా మారుస్తాం అంటూ ప్రచారం చేసుకుంటున్న మంత్రి కొల్లు రవీంద్ర మొదట స్వయంగా పోలీసులే చెప్పిన వాస్తవాలను ఓసారి గమనించాలని, సాక్షాత్తు అవనిగడ్డ డీఎస్పీ మీడియా సమావేశంలో బహిరంగంగా "అధిక హోదాలో ఉన్న వ్యక్తులు మట్టి, బియ్యం, మద్యం మాఫియాలను అడ్డుకునే ప్రయత్నాలను నిలిపివేయమంటూ బెదిరింపు ధోరణిలో ఫోన్ కాల్స్ చేస్తున్నారంటూ" చెప్తుండగా మీరేమో జగన్ ప్రభుత్వంలో కృష్ణా జిల్లా ను ల్యాండ్, శాండ్, వైన్, మైన్ కుంభకోణాలతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారనటం ఏమాత్రం సబబు కాదని గౌతమ్ తెలిపారు. ముఖ్యంగా అవనిగడ్డ నియోజకవర్గంలో డీఎస్పీ స్థాయి ఆఫీసర్లకు బెదిరింపు ధోరణిలో ఫోన్ కాల్స్ చేస్తూ మాఫియాను నడిపిస్తుంటే ఇంకా 'పి4, విజన్ 2047' అంతా బూటకపు మాటలేనని, మీ పాలనలో పోలీసులు కూడా బెదిరింపు మాట చెబుతున్నారంటే, మరి మీరు చెప్పే అభివృద్ధి ఎలా సాధ్యమని, మీ ప్రభుత్వ పని తీరు మాఫియాల కోసమా? ప్రజల కోసమా? అని గౌతమ్ ప్రశ్నించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఇప్పుడు ప్రజలు చూస్తున్న వాస్తవాలు ఏమిటంటే రోజూ అక్రమంగా తరలిస్తున్న మట్టితో కూడిన ట్రాక్టర్లు, మద్యం సింగిల్ సేల్స్‌తో ఉన్న వైన్ షాపులు, బియ్యం అక్రమ రవాణాతో వాహనాలు, రైతు బజార్లలో నిర్ణయించిన ధరల కన్నా అధిక రేట్లు.?ఇవన్నీ మీ అభివృద్ధి రిపోర్ట్ కార్డులో ముద్రించాలని మీరు అనుకుంటున్నారా అని గౌతమ్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ నీటి సంఘ అధ్యక్షులు వర్రే బసవరావు, సామాజిక వేత్త ఎస్సీ నాయకులు చిక్కాల సురేష్, న్యాయవాది ఎం.ఆదిత్య, అద్దంకి శేషు పాల్గొన్నారు.

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కు తొర్లికొండ సీతారామయ్య సత్కారం



**నందిగామ, జులై 9, మేజర్ న్యూస్:** విజయవాడలో రాష్ట్ర భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నూతన రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన పివిఎన్ మాధవ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నందిగామ భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మునగంటి కామేశ్వరరావు, డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ, వీసం రాఘవ.తులసి కృష్ణ. గోనెల సత్యనారాయణ, కటుకూరి సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్‌ని సత్కరించిన పంతం వెంకట గజేంద్రరావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బుధవారం భారతీయ జనతా పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన,పివిఎన్ మాధవ్ ని రాష్ట్ర,కార్యాలయం కలిసిన బీజేపీ నాయకులు,బాధ్యతలు స్వీకరించిన యువ నాయకుడు పివిఎన్ మాధవ్ ని కలిసి అభినందనలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు పంతం వెంకట గజేంద్ర రావు, మిత్ర బృందం

## కార్మికుల సమ్మె విజయవంతం



**జగ్గయ్యపేట, జూలై 9, మేజర్ న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పట్టణంలోని వివిధ సంఘాల కార్మికులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ నాయకులు పోతుపాక వెంకటేశ్వర్లు సిపిఐ నాయకులు అంబోజీ శివాజీ,జూనెబోయిన శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర పాలక ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా కార్మికులు పెద్ద సంఖ్యలో ఈ సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోడీ కార్మికుల పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను రద్దుచేసి కార్పోరేటర్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్ ల ని తీసుకువచ్చి కార్మికులను కార్పొరేటర్లకు కట్టు బానిసలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ అవలంబిస్తున్న తప్పుడు విధానాల కారణంగా సంఘాలు పెట్టుకునే హక్కులను కోల్పోవడంతో పాటు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికు లకు న్యాయపరంగా ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును కూడా నిర్వీర్యం చేశారని, కార్మికుల పట్ల పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న సార్వత్రిక సమ్మెను చూసైనా ప్రభుత్వ పెద్దల్లో మార్పు రావాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో అంగన్వాడి, ఆశ, మున్సిపల్,ఆటో యూనియన్, భవన నిర్మాణ కార్మికులు, వివిధ బ్యాంకుల ఉద్యోగులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, సీపీఐ నాయకులు భోగ్యం నాగులు మాశెట్టి రమేష్ బాబు, మహమ్మద్ అసుతుల్లా,సిఐటియు నాయకులు, కమల,నాగమణి, శేషు కోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జాతి కోసం మీడియేషన్ : కృష్ణాజిల్లా జడ్జి జి.గోపి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసులు త్వరిత గాతిన పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా 90 రోజుల్లో మీడియేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపి అన్నారు. బుధవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 64 మంది మీడియేటర్లకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గోపి మాట్లాడుతూ మహాకవి వచనాలతో మనల్ని మనం సరిదిద్దుకోవాలని ఆలోచనల మార్పు రావాలని అన్నారు. జాతి పునర్మానం కోసం అందరూ దిద్దుబాటు వైపు ప్రయాణం చేయాలని అన్నారు. కీలకమైందని 30 సం.లు, 20 సం.లు, 10 సం.లు పైబడిన కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్ ఉన్నాయన్నారు. చరిత్ర చూసుకుంటే శ్రీకృష్ణుడు కూడా కౌరవులకు పాండవులకు మధ్య మధ్యవర్తిగా వ్యవహరించాలని వినకపోవడం వల్ల యుద్ధ పరిస్థితి ఏర్పడింది అని అన్నారు. జిల్లా జడ్జి పాడిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కృష్ణాజిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రామకృష్ణయ్య మాట్లాడుతూ పార్టీలకు మంచి వాతావరణం ఏర్పడడానికి మీడియేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మానవ వాళి సంక్షేమం కోసం దేశాల మధ్య క్షేమం కోసం మీడియేషన్ ఎంతగానో ఉపయోగపడిన విషయం అందరు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవధికార సంస్థ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలో ఎంపిక చేసిన 11 బార్ అసోసియేషన్ లకి చెందిన 64 మంది న్యాయవాదులు, సోషల్ వర్కర్స్‌కి శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు రాబోయే 90 రోజులలో మీడియేషన్ ద్వారా పలు కేసులు పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రెండవ అదనపు జిల్లా జడ్జి, 3వ జిల్లా జడ్జి మచిలీపట్నం బార్ అసోసియేషన్ నుండి లంకిశెట్టి బాలాజీ, అడపా మురళి, గరిమెల్లా ప్రభాకరరావు, గంజి నాగేంద్రం, జి. శ్రీనివాస్, ఎస్. రమాదేవి, ఓ.ఎస్. కే. శివకుమార్, విజయవాడ హాజరుతయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా విస్తృతంగా "ఆపరేషన్ సేఫ్ క్యాంపస్"





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఉత్తర్వుల మేరకు, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఆదేశాలపై జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యాసంస్థల సమీపంలో ఉన్న దుకాణాలపై కృష్ణాజిల్లా పోలీస్ యంత్రాంగం "ఆపరేషన్ సేఫ్ క్యాంపస్" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బంగారు భవిష్యత్తుతో జీవించవలసిన యువతను మాదకద్రవ్యాల ఊబిలోకి దించి, వారి జీవితాన్ని అగాధంలోకి నింపుతున్న మాదకద్రవ్యాల, గంజాయి, పొగాకు, గుట్కా, విక్రేతలపై చర్యలు తీసుకునేందుకు కోట్పా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది.ఈ స్పెషల్ డ్రైవ్‌లో గంజాయి ఇతర మాదకద్రవ్యాలతో తయారుచేసిన చాక్లెట్స్ ఇతర వస్తువుల విక్రయాలు ఏమైనా జరుగుతున్నది అనే అంశంపై లోతుగా తనిఖీలు నిర్వహించి, విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న ప్రతి దుకాణాలపై ప్రత్యేక నిఘ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా "ఆపరేషన్ సేఫ్ క్యాంపస్" స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం చిన్న అలవాటుగా మారి యువత మాదకద్రవ్యాల ఊబిలో చిక్కుకొని వారి జీవితాలను నాశనం చేసుకోకుండా ఉండే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.ఈ డ్రైవ్‌లో పాఠశాలలు, కళాశాల సమీపంలో ఉన్న షాపులలో అనుమతులు లేకుండా పొగాకు, గుట్కా, ఇతర నిల్వలపై తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సోదాలు నిరంతరం కొనసాగుతాయి. యువతను పాడు చేసే మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల నిల్వలు కలిగి ఉన్నా, అక్రమంగా విక్రయాలు జరిపిన ఉపేక్షించేది లేదు.అలా నిల్వలు కలిగి ఉన్న షాపు యజమానులపై కేసులు నమోదు చేసి, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.కనుక వ్యాపారస్తులు మీ లాభాల కోసం కాక విద్యార్థులు యువత బంగారు భవిష్యత్ కోసం విజ్ఞతతో వ్యవహరించాలని, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే వస్తువుల విక్రయాలకు స్వస్తి పలకాలని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆడిషన్ ఎస్పి అడ్మిన్ వి.వి నాయుడు, అన్ని సబ్ డివిజన్ల డిఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# టాటా హిటాచీ 'షిన్‌రాయి ప్రైమ్ సీఈవీ 5' ఆవిష్కరణ




**రాజమండ్రి, జూలై 9, మేజర్ న్యూస్ :** భారత నిర్మాణ పరికరాల పరిశ్రమలో ప్రముఖంగా ఉన్న టాటా హిటాచీ తాజాగా నూతన తరహా బ్యాక్హో లోడర్ 'షిన్‌రాయి ప్రైమ్ సీఈవీ 5'ను రాజమండ్రిలోని హోటల్ మంజీర సరోవర్ ప్రీమియర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాటా హిటాచీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) సిద్ధార్థ్ చతుర్వేది మాట్లాడుతూ ఈ యంత్రాన్ని వినియోగదారుల పెరుగుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకొని తయారు చేశామన్నారు. టాటా హిటాచీ నూతన ఆవిష్కరణలతో పాటు వినియోగదారుల కేంద్రీత దృష్టి కోణానికి ఇది నిదర్శనమన్నారు. ఆధునిక టెలిమాటిక్స్ సాంకేతికతతో ఈ బ్యాక్హో లోడర్ అధిక ఉత్పాదకత, తక్కువ నిర్వహణ ఖర్చులు, స్మార్ట్ యంత్ర నిర్వహణను అందిస్తుందన్నారు. షిన్‌రాయి ప్రైమ్ ఇది ఒక ఉత్పత్తి మాత్రమే కాదని, ఇది నమ్మకం, విలువలకు నిదర్శనమన్నారు. షిన్‌రాయి ప్రైమ్ సీఈవీ 5లో ఎంతో శక్తివంతమైన జపనీస్ ఇంజన్ కలదన్నారు. అద్భుతమైన హైడ్రాలిక్ సిస్టమ్, లోతుగా తవ్వడం కోసం, ఎక్కువ దూరం చేరుకోవడం కోసం పొడవైన 2.47 మీటర్ల బ్యాక్హో బూమ్, ఇన్‌సైట్ టెలిమాటిక్స్ సదుపాయం, ఆపరేటర్ల భద్రత కోసం ఆర్ఓపీఎస్, ఎఫ్ఓపీఎస్ క్యాబిన్, బురద ప్రాంతాల్లో పని చేసేందుకు వీలుగా ప్యారలలోగ్రామ్ డబుల్ సిలిండర్ లోడర్ ఆర్మ్ డిజైన్ ఉన్నాయన్నారు. అత్యుత్తమ ఇంధన సామర్థ్యాన్ని, తక్కువ ఆర్పీఎం వద్ద అధిక టార్క్‌ను అందిస్తుందన్నారు. ఇది నిబంధనలకు అనుగుణంగా తక్కువ ఉద్గారాలతో పని చేస్తుందన్నారు. ఈ యంత్రం అధిక నాణ్యత గల స్టీల్‌తో, రోబోటిక్ వెల్డింగ్ సాంకేతికతతో తయారు చేయబడిందన్నారు. కఠినమైన పరిస్థితులకు కూడా అనువుగా ఉంటుందన్నారు. వినియోగదారులకు టాటా హిటాచీ జెన్యూన్ స్పేర్ పార్ట్స్, గోదాములు, క్షేత్ర పరీక్ష వాహనాల ద్వారా వేగవంతమైన ఆఫ్టర్ సేల్స్ సేవలు కలవన్నారు. వినియోగదారులు తమ వ్యాపారంలో ముందుండేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. దీనిని వివిధ రంగాల కోసం ప్రత్యేకంగా రూపొందించామన్నారు. నిర్మాణం, క్వారీల పని, వ్యవసాయం, ట్రెంచింగ్ వంటి అనేక అవసరాల కోసం ఉపయోగించవచ్చన్నారు. దీర్ఘకాలిక మెంటెనెన్స్, తక్కువ ఆపరేటింగ్ ఖర్చులతో ప్రత్యేకంగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు, టాటా హిటాచీ సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యులు, అధికారిక డీలర్ భాగస్వామి శ్రీ ధనలక్ష్మి ఆటో ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సభ్యులు పాల్గొన్నారు.



## మండల స్థాయి శిక్షణ సమావేశం ముగింపు

**పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ :** మండల ప్రజా పరిషత్ కార్యాలయము చిల్లకల్లులో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం, కృష్ణా, మచిలీపట్నం వారి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్ జి ఎస్ ఏ) కార్యాచరణ ప్రణాళిక - 2025-26 కెపాసిటీ బిల్డింగ్ & ట్రైనింగ్స్- గ్రామ పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పి ఎ ఐ 2.0) తయారు చేయునిమిత్తం ఒక్క రోజు మండల స్థాయి శిక్షణా కార్యక్రయము డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శ్ కె. పద్మావతి అధ్యక్షతన నిర్వహించటము జరిగినది. ఈ శిక్షణా కార్యక్రమములో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, మండల అగ్రికల్చర్ ఆఫీసర్స్, హెల్త్, ఎంజిఎన్ఆర్ఇజిఎస్, సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అని ఎంపీడీవో జి నితిన్ తెలిపారు.



## జాతీయ రహదారిపై బల్లిపర్రు వద్ద డ్రమ్ముల ఏర్పాటు

**పామర్రు జులై 9 మేజర్ న్యూస్:** మచిలీపట్నం - విజయవాడగా జాతీయ రహదారి 65పై తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు డ్రమ్ములను ఏర్పాటు చేశారు. పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో బ్లాక్ స్పాట్ గా గుర్తించిన బలిపర్రు గ్రామం వద్ద గుడివాడ డిఎస్ పి వి.ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో పామర్రు సిఐ వి.శుభాకర్, ఎస్ఐ వి. రాజేంద్రప్రసాద్ లు బుధవారం వీటిని ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, పరిసర ప్రాంతాల వారు రోడ్డు దాటేటప్పుడు, జాతీయ రహదారిపై ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుని వెళ్లాలని ఈ సందర్భంగా ఎస్ఐ రాజేంద్రప్రసాద్ సూచించారు.

## ఎల్ఐసి సిబ్బంది సమ్మె సంపూర్ణం, జయప్రదం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణం విడనాడాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాల ఆధ్వర్యంలో స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట దేశవ్యాప్త పిలుపుమేరకు జరిగిన సమ్మె కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారని, ఈ ఆలోచన విరమించాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసిలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమం మరోమారు చేపట్టనున్నదని, దీని వల్ల సంస్థకు, పాలసీదారులకు ఏ రకమైన ప్రయోజనం లేదని అన్నారు. బీమా ప్రీమియంలపై భారంగా మారిన 18 శాతం జీఎస్టీని తగ్గించాలని ఆయన కోరారు. సంస్థలో పని భారం బాగా పెరిగిందని, 3,4 తరగతుల సిబ్బంది కోసం రిక్రూట్మెంట్ తక్షణం చేపట్టాలన్నారు.దేశంలో రాజస్థాన్, మరో నాలుగు రాష్ట్రాలు కొత్త పెన్షన్ విధానానికి స్వస్తిపలికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని, ఎల్ఐసి లో కూడా అందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని అన్నారు.బ్యాంకింగ్ రంగ యూనియన్ నాయకులు సలాం, వాణి సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, కస్టమర్స్ పై సర్వీస్ చార్జెస్ రద్దు చెయ్యాలి అని, బ్యాంకింగ్ రంగ ప్రయివేటీకరణ నిలుపుదల చెయ్యాలని డిమాండ్ చేసారు. సమ్మె కు సంగీభావంగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి. పోతరాజు,వామపక్ష ఉద్యమ నాయకులు కొడాలి శర్మ రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు ఎస్. ధనుంజయరావు,ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు కె. రాజారావు ఐ సీ యు ఈ నాయకులు జె. సుధాకర్, సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఎల్. రాజ శేఖర్, ఏ, శ్రీనివాస రావు, వై. స్వామినాథ్,ఎస్. వి. రత్నా రావు, బి హెచ్ మాధుర్, తదితరులు నాయకత్వం వహించారు.పెద్ద సంఖ్య లో ఇన్సూరెన్సు, బ్యాంకు ఉద్యోగులు సమ్మె శిబిరంలో పాల్గొని జయ ప్రదం చేసారు.

## పేదల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పేదల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని సీనియర్ తెలుగుదేశం నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు. బుధవారం అవనిగడ్డ శివారు సీతాయలంక ప్రాంతంలో సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం జరుగగా ఈ కార్యక్రమంలో బొబ్బా గోవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. రేపటి తరం భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సంపద సృష్టించి ఆ ఫలాలను ప్రజలకు అందిస్తూ ముందుకు సాగుతున్నారని, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రానికి ముందెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నారన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం మండల ఇంచార్జి కర్రా సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఈ కార్యక్రమంలో బండే రాఘవ, పర్చూరి దుర్గాప్రసాద్,కంచర్ల ఆనంద్,మేడికొండ విజయ్, ఘంటశాల రాజమోహన రావు,కొల్లూరి వాసు,కమ్మిలి సుబ్రమణ్యం, మేడికొండ సురేష్, దోవారి ప్రసాద్,తూమాటి మల్లి, కర్రా యేసుబాబు, గుంటూరు చంటి, దిడ్ల ప్రభుదాస్, నీల మనోహర్,బండ్రెడ్డి సురేష్,గుంటూరు మోహనరావు, గుంటూరు లక్ష్మణ రావు,కర్రా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఎన్డీయే కూటమి పాలన







### గొల్లపూడి దర్గా హరిజనవాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

### స్వయంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేసిన ఎంపీ

**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. కూటమి ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంతో వున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మైలవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలంలో గొల్లపూడి దర్గా హరిజన వాడలో సుపరిపాలన తొలి అడుగు 4.1 కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ), మైలవరం నియోజకవర్గ అబ్జర్వర్, తెలుగుదేశం పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్,రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు జంపాల సీతారామయ్య, బొమ్మసాని సుబ్బారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), గొల్లపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్రా వాసులతో కలిసి బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు వివరించేలా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్నిసీఎం చంద్రబాబు రూపొందించటం జరిగిందన్నారు. ఎన్డీయే కూటమి ఏడాది పాలనలో ఇంటింటికి సంక్షేమం అందితే... వైసీపీ పాలనలో ఇంటింటికి మోసం జరిగిందన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందటంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి ఒకేసారి అమలు చేయగలిగిన ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు అంటూ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని అన్నారు. ఎలాంటి రాజకీయ జోక్యం, పైరవీలు, షరతులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు, సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు రూ.5లకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మూసివేస్తే...సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాష్ట్రంలో 204 అన్న క్యాంటీన్లు పునరుద్ధరించినట్లు తెలిపారు. త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నాడన్నారు. అలాగే మహిళలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తుండటంతో పాటు, తల్లివందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంతమందికి పదిహేను వేల రూపాయలు ఇవ్వటం జరిగిందన్నారు. అదే విధంగా ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నారని, అలాగే. పీ 4 లింక్ ద్వారా ప్రతి నెల మహిళలకు ప్రతినెల రూ.1500 భృతి ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నూతలపాటి నారద, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు గూడపాటి పద్మశేఖర్, పార్లమెంట్ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్లమూడి చలపతి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫైజాన్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, మాజీ ఎంపీపీ వడ్లమూడి జగన్, గొల్లపూడి తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు నూతలపాటి శివరాం, మాజీ ఎంపీటీసీ బొర్ర తిరుపతిరావు, 40 డివిజన్ పార్టీ అధ్యక్షుడు పీవీ సుబ్బయ్య, బూత్ కన్వీనర్లు చుండి నరసింహ, లంకా వెంకటేశ్వరరావు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో మోడల్ ఫ్లవర్ మార్కెట్ నిర్మించేందుకు ప్రతిపాదనలు

### ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణం

### ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** హోల్ సేల్ రిటైల్ పూల వ్యాపారులు, వినియోగదారులకు అమోద యోగ్యంగా మోడల్ ఫ్లవర్ మార్కెట్‌ను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని, నిబంధనలకు లోబడి హోల్ సేల్ పూల మార్కెట్ వర్తక సంక్షేమ సంఘమే మార్కెట్ నిర్మాణం చేసుకుని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. హోల్ సేల్ పూల మార్కెట్ వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూల మార్కెట్ నిర్మాణం పై మంగళవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కలెక్టరేట్‌లోని ఆయన సమావేశ మందిరంలో మార్కెటింగ్, ఉద్యాన, నగరపాలక సంస్థ, పూల వర్తక సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జి.ఎస్ రాజు రోడ్డులోని రైతు బజారుకు సంబంధించిన 80 సెంట్ల స్థలంలో హోల్ సేల్ పూల మార్కెట్‌ను నిర్మించాలనే ఆలోచన చేయడం జరిగిందన్నారు. 2023లో ఏర్పాటు చేసిన జి.ఎస్ రాజు రోడ్డులోని రైతు బజారుకు కేధారేశ్వర పేట రైతు బజారు సమీపంలో ఉండుట వలన వినియోగదారులు జి.ఎస్.రాజు రోడ్డు రైతు బజారుకు వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదన్నారు. కేవలం 10 నుంచి 15 స్టాల్స్ మాత్రమే రైతులు వ్యాపారం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ పరిస్థితులలో సంబంధిత రైతు బజార్‌ను తొలగించి అదే ప్రదేశం హోల్ సేల్ పూల మార్కెట్‌ను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం విజయవాడ నగర పాలక సంస్థ సమీపంలో గల హోల్ సేల్ పూల మార్కెట్ రైల్వే స్థలంలో ఉన్నందున ఆ స్థలాన్ని అప్పగించాలని రైల్వే అధికారులు కోరిన నేపథ్యంలో పూల రైతులు, రిటైల్ వర్తకులు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా పూల మార్కెట్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు చెందిన పూల తోటల రైతులు, చుట్టు పక్కల పూల రైతులకు అందుబాటులో ఉండేలా జి.ఎస్. రాజు రోడ్డు రైతు బజార్ స్థలంలో మోడల్ ఫ్లవర్ మార్కెట్‌ను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించనున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మోడల్ ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి అయ్యే పూర్తి ఖర్చును హోల్ సేల్ పూల మార్కెట్ వర్తకు సంక్షేమ సంఘమే చెల్లించాల్సి ఉంటుందని, సంఘ సభ్యులకు మాత్రమే షాపులను కేటాయించాలని, 10 శాతం షాపులు ప్రభుత్వ నిర్వహణకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. స్థలం అద్దె ప్రాతిపదికన కేటాయిస్తామని ప్రతి మూడు సంవత్సరాలకు 10 శాతం అద్దె పెంపు ఉంటుందన్నారు. వినియోగదారులతో పాటు నగరానికి విచ్చేసే సందర్శకులు పర్యాటకులను ఆకర్షించే రీతిలో మోడల్ ఫ్లవర్ మార్కెట్‌ను నిర్మించాల్సి ఉంటుందన్నారు.

హోల్ సేల్ పూల వర్తకుల సంఘ ప్రతినిధులు, అధికారులు రాజమండ్రి సమీపంలోని కడియం పూల మార్కెట్‌ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన మౌళిక వసతులను పరిశీలించి మరింత మెరుగైన సౌకర్యాలతో దేశంలోనే మోడల్ పూల మార్కెట్‌గా నిర్మించేలా ముందుకు వస్తే అనుమతులకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరగుతుందని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్.బి. రాజాబాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె. బాలాజీ కుమార్, నగరపాలక సంస్థ ఎస్టేట్ అధికారి ఎ. శ్రీధర్ హోల్ సేల్ పూల మార్కెట్ వర్తక యాజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సైయద్ రఫీ ఉప అధ్యక్షులు జి. అశోక్ కుమార్ కార్యదర్శి పి.ఎస్.డి. ప్రకాష్, సంయుక్త కార్యదర్శి ఎ. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ఫ్లోర్ పెయింటింగ్ కాంపిటీషన్‌లో పాల్గొని

## నగదు బహుమతులను గెలుచుకోండి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఫ్లోర్ పెయింటింగ్ కాంపిటీషన్లో పాల్గొని, నగరంలోని పర్యాటక ప్రదేశాన్ని సుందరీకరించమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నా రు. బుధవారం ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో ఫ్లోర్ పెయింటింగ్ కాం పిటీషన్లో ప్రజల భాగస్వాములు కావాలని ప్రకటన ద్వారా తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా ఆదేశాల మేరకు, స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా, నగరంలోని ప్రధాన పర్యాటక ప్రదేశం అయిన బర్మ్ పార్క్ ను సుందరీకరించే దిశగా, జులై 13, 2025 ఆదివారం ఉదయం 6.30 లకు, బర్మ్ పార్క్ లో ఫ్లోర్ పెయింటింగ్ కాంపిటీషన్ లో భాగస్వాములు కావాలని నగరంలోని ప్రజలకు కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ పెయింటింగ్ కాంపిటీషన్లో రెండు కేటగిరీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు మొదటి కేటగిరీలో 12 సం.ల కంటే ఎక్కువగా ఉన్నవారు నేలపైన పెయింటింగ్లు వేయగా 12 సం.ల కం టే తక్కువ వయసుగల పిల్లలు డ్రాయింగ్ షేప్‌ల పైన డ్రాయింగ్ కాంపిటీ షన్ నిర్వహిస్తున్నారని అన్నారు.ఫ్లోర్ పెయింటింగ్‌కు నగదు బహుమతు లుగా మొదటి బహుమతి పదివేల రూపాయలు రెండవ బహుమతి 7500 రూపాయలు మూడో బహుమతి 5వేల రూపాయలు 4వ బహుమతి 3000 రూపాయలు, వెయ్యి రూపాయల కన్సోలేషన్ బహుమతులు ఐదు ఉన్నాయని తెలిపారు. రెండో క్యాటగిరి అయిన 12 సంవత్సరాలలోపు పిల్లలకు డ్రాయింగ్ కాంపిటీషన్లో ట్రోఫీ బహుమతులు ఉన్నాయని తెలిపారు. ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్లో పాల్గొనేందుకు 7075196840కు దరఖాస్తు చేయవలసిందిగా వెల్లడించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఉంటాయని తెలిపారు.

### తైక్వాండో ఛాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ, మేజర్ న్యూస్ :** 10వ నేషనల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2025 పోస్టర్‌ను ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ది కృష్ణ డిస్ట్రిక్ టైక్వాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ సహకారంతో 10వ నేషనల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ కాంపిటీషన్స్ జూలై 25 నుంచి జూలై 27 వరకు పటమట హైస్కూల్ రోడ్డులో గల చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్‌కు అసోసియేషన్ సెక్రటరీ ఎల్.శివ భాస్కర్ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్, కార్యవర్గ సభ్యులు వి.రాము, పి.సంపత్, ఎస్. రంజిత్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు **ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999